లంక గ్రామాలకు పొంచి ఉన్న వరద ముప్పు!

- కృష్ణా నది పరివాహక లంక గ్రామాలకు వరద ముప్పు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి


పెదపులివర్రు-చింతమోటు గ్రామాల మధ్య ఉన్న లో-లెవల్ చప్టాను పరిశీలిస్తున్న ఏవో

భట్టిప్రోలు: కృష్ణా నది పరివాహక లంక గ్రామాలకు వరద ముప్పు పొంచి ఉందన్న సమాచారం నేపథ్యంలో వ్యవసాయశాఖాధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం భట్టిప్రోలు మండలం పెదపులివర్రు-చింతమోటు గ్రామాల మధ్య ఉన్న లో-లెవల్ చప్టాను ఏవో బి.బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. మండలం నుంచి లంక గ్రామాలకు రాకపోకలు నిలిచాయని తెలిపారు. ప్రస్తుతానికి ఎటువంటి పంట నష్టం లేదని ఆయన పేర్కొన్నారు. ముంపు ప్రభావిత గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వరద తగ్గే వరకు లంకలకు వెళ్లే అవకాశం లేదని చెప్పారు. కార్యక్రమంలో విస్తరణ శాఖాధికారులు కె.లక్ష్మి ప్రసన్న, వి.బుష్, టి.అఖిల, వీహెచ్ఏ ఎ.గోపిరాజు, రైతులు పాల్గొన్నారు.

రేపల్లె: వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వరద ముంపుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వరద ముంపుతో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. లంక గ్రామాల్లో ఎవరైనా వేటకు వెళ్లి ఉంటే తిరిగి వచ్చే విధంగా ఇప్పటికే సమాచారం అందించినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం.. పారిశుద్ధ్య పరిరక్షణ నిర్వహించడం తదితర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వరద ముంపు వివరాలు తెలియజేసేందుకు ఆయా ప్రాంతాల్లో నియమించిన అధికారులు ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రైతులను తక్షణమే ఆదుకోవాలి

ముంపు పొలాలను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నాయకులు


ముంపు పొలాలను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాపట్ల టౌన్: భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు తెలిపారు. మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోనరఘుపతి ఆదేశాల మేరకు మండలంలో ముంపునకు గురైన పొలాలను గురువారం మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. తొలుత మండలంలోని కంకటపాలెం, నరసాయపాలెం, జమ్ములపాలెం, మూలపాలెంలోని భారీ వర్షాలకు నీటమునిగిన పొలాలను పరిశీలించారు. హరిబాబు మాట్లాడుతూ.. డ్రైనేజీల ఆధునికీకరణ జరిగి ఉంటే రైతులకు ఈ పరిస్థితి దాపరించేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవడంతో పాటు రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులను పంపిణీ చేయాలన్నారు. రైతుల విస్మరిస్తే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా ముంపునకు గురైయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్లు గవిని కృష్ణమూర్తి, దొంతిబోయిన సీతారామిరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, మండల పార్టీ అధ్యక్షులు మరుప్రోలు కొండలరెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ ఉపాధ్యక్షులు పిన్నిబోయిన ప్రసాద్, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు వడ్డిముక్కల డేవిడ్, నియోజకవర్గ ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షులు జోగిరాజా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమల వృద్ధిని అరికట్టడానికి ప్రజలు సహకరించాలి



రేపల్లె: దోమల వృద్ధిని అరికట్టడానికి పట్టణ ప్రజలందరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. దోమల నివారణ చర్యలలో భాగంగా గురువారం పట్టణంలోని చెరువులలో 'గంబూషియా' చేపలను ఆయన వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంబూషియా చేపలు నీళ్లలో ఉన్న దోమల లార్వాను తినడంతో దోమల ఉత్పత్తి తగ్గుతుందని.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూడాలని ఆయన కోరారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో తేమ వాతావరణం, మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లపై దర్యాప్తు

వేమూరు: దివ్యాంగుల పింఛన్లపై దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీవో చొప్పర శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 650 దివ్యాంగుల పింఛన్లపై దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి మండలం నుంచి 50 మందిని దర్యాప్తు చేస్తున్నామని.. వీరికి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. పూర్తయిన సమాచారాన్ని ప్రతి గ్రామ సచివాలయానికి పంపించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల దివ్యాంగులు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై ప్రత్యేక దృష్టి




బాపట్ల అర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్స్‌ను ఆయన గురువారం పంపిణీ చేశారు. ఇటీవల పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులను అందించామని తెలిపారు. కార్మికులు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు కూడా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్ పంపిణీ



వేమూరు: కూటమి ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ పుర వేదిక వద్ద ఆయన గురువారం డ్రోన్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై ఇస్తోందన్నారు. అర్హత గల రైతులు పొందాలని ఆయన కోరారు. కుచ్చెళ్లపాడు వీర నాగమ్మ తల్లి గ్రూపు సభ్యులకు రాయితీపై డ్రోన్ అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షులు గాజుల వెంకట సుబ్బయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిషోర్, మండల వ్యవసాయాధికారి కె.ప్రేమసాగర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభాగ్యురాలకు రోడ్డే ఆవాసం!



తెనాలి: ఓ అభాగ్యులు పట్టణంలో మతిస్థిమితం లేకుండా సంచరిస్తోంది. రాత్రింబవళ్లు రోడ్లపైనే కాలక్షేపం చేస్తుండడం చూసేవారికి దయనీయంగా అనిపిస్తోంది. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని పాత ప్రభుత్వ వైద్యశాల, ఆర్ఆర్ ఫర్నిచర్స్ పరిసర ప్రాంతాల్లోనే ఆమె తిరుగుతూ కాలం గడుపుతోంది. ఎవరికైనా పాపం అనిపించి ఏదైనా తినడానికి సాయం చేసినా తీసుకోదని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తన్నీరు శివశంకర్ తెలిపారు. గతంలో స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో 'ఆశ్రయ' వార్డు పదేళ్లపాటు నడిచింది. ఇలా రోడ్లపై తిరిగే మతిస్థిమితం లేని వారిని తీసుకువెళ్లి ఆశ్రయమిచ్చేవారు. భోజనం అందిస్తూ వారిలో మానసిక పరివర్తనకు కృషిచేసేవారు. ప్రస్తుతం నిర్వాహకులు లేక ఆశ్రయం మూతపడింది. అధికారులు చర్యలు తీసుకుని యువతిని ఏదైనా ఆశ్రమానికి తరలించాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యమాలకు స్ఫూర్తి భట్టిప్రోలు!


- స్వాతంత్ర్యోద్యమానికి 20 మంది యోధులు
- స్థలాలను ఉదారంగా అందించిన ఘనత


మద్దుల వెంకటగిరిరావు, రామాయమ్మ దంపతులు(ఫైల్)


భట్టిప్రోలులోని మారం వెంకటేశ్వర్లు ప్రాథమికోన్నత పాఠశాల

భట్టిప్రోలు: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భట్టిప్రోలు మండలం స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తి నింపింది. మహాత్మాగాంధీ 1942లో చెరుకుపల్లి మండలం కావూరు వినయాశ్రమంకు వచ్చి భట్టిప్రోలు చేరుకున్నారు. స్థానిక మారం వెంకటేశ్వర్లు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉద్యమకారులతో గాంధీజీ సమావేశం నిర్వహించారు. ఉద్యమానికి బాసటగా నాడు ఎవరికి తోచిన రీతిలో వారు తమ ఒంటి మీద బంగారం, వెండి ఆభరణాలు, నగదును ఆయనకు అందించారు. భట్టిప్రోలు నుంచి మద్దుల వెంకటగిరిరావు ఆయన సతీమణి రామాయమ్మ నేతృత్వంలో 20 మంది ఉద్యమంలో పాల్గొన్నారు. ముందుగా వెంకటగిరిరావు సతీమణి తన ఒంటిపై ఉన్న సర్వ ఆభరణాలు ఉద్యమం కోసం సమర్పించారు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వం ఆ దంపతులను తమిళనాడులోని రాయవెల్లూరు జైలుకు తరలించారు. గర్భిణి అయిన రామాయమ్మ జైలులో సువర్చలా దేవికి జన్మనిచ్చింది. అప్పటి నుంచి భట్టిప్రోలు గ్రామం ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. ఆ దంపతులకు ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. వెంకటగిరిరావు 1973లో, ఆయన సతీమణి రామాయమ్మ 1991లో పరమపదించారు. వీరు భట్టిప్రోలులో వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. అలాగే మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ నిర్మాణాలకు స్థలాలను ఉదారంగా అందించారు.

ఉద్యమంలో పాల్గొన్న బాలకోటయ్య..


సంగపు బాలకోటయ్య (ఫైల్)

భట్టిప్రోలుకు చెందిన సంగపు బాలకోటయ్య 1942 ఇక్కడకు వచ్చిన గాంధీజీ ఇచ్చిన ప్రసంగానికి ముగ్ధుడై ఆయన బాటలో పయనించేందుకు కార్యోన్ముఖుడయ్యారు. భార్య, ఐదుగురు బిడ్డలను వదిలి స్వాతంత్ర్య ఉద్యమం బాట పట్టారు. పోలీసుల లాఠీ దెబ్బలు కూడా లెక్క చేయకుండా ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం ఆయనకు జీవిత ఖైదుని విధించింది. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఆయన జైలు జీవితం గడిపారు. ఈయన 2006 సంవత్సరంలో పరమపదించారు. అలాగే పల్లెకోనకు చెందిన మండవ బసవపున్నయ్య కూడా గాంధీజీ ఇచ్చిన స్ఫూర్తితో ఉద్యమంలో పాల్గొనడంతో బళ్లారి జైలులో ఖైదు అనుభవించారు. ఆయన ఆరేళ్ల క్రితం పరమపదించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అమర్తలూరు(వేమూరు): జ్వరాలు విజృంభిస్తున్న కారణంగా ప్రజలందురూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రాథమిక వైద్యాధికారి వెంకటలక్ష్మీ తెలిపారు. మండల కేంద్రంలోని వైద్య సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడు వాపు వ్యాధులు వస్తాయని.. అవి రాకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కంఠ ఉమాకాంత్, కొల్లి శ్రీనివాసరెడ్డి, మండే బాబురావు, పుట్టగుంట శ్రీనివాసరరావు పాల్గొన్నారు.

మెరుగైన సేవలను అందించేందుకు శిక్షణ



కర్లపాలెం: పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుని ప్రజలకు మేలైన సేవలందించేందుకు శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో ఏపీలోని ఏడు జిల్లాలకు సంబంధించిన 48 మంది ఎంపీడీవోలకు గత నెల 28వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. శిక్షణలో భాగంగా గురువారం 48 మంది ఎంపీడీవోలు కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం రికార్డులు, ఉపాధి హామీ పథకం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అధికారులు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడే సక్రమంగా పరిష్కరించగలుగుతారని చెప్పారు. కార్యక్రమంలో కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలతో పాటు తిరుపతి జిల్లాకు చెందిన ఎంపీడీవోలు, శిక్షణ సీనియర్ ఫ్యాకల్టీలు కె.లలిత, పి.రామకృష్ణ, కర్లపాలెం ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రజని తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలం



పెరవలి(వేమూరు): కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు దాది సుబ్బారావు తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తిరిగి కూటమి మోసాలను ఆయన ప్రజలకు వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు పంట బీమా చెల్లించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి పోతురాజు, దాది రజిని, గుమ్మడి సత్యనారాయణ, జొన్నకూటి వెంకట నారాయణ, గుమ్మడి సత్యనారాయణ, కొండ్రు శ్రీనివాసరరావు, గుమ్మడి చిన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమరయోధుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

తెనాలి అర్బన్: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని అందరూ కలిగి ఉండాలని వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఈ.శీలా పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలను పట్టుకుని 'భారత మాతకు జై' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు వి.కాత్యాయని, పి.ఇందు, కె.అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆహార పొట్లాల పంపిణీ



ఆహార పొట్లాలు అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు


పేదలకు సాయం అందిస్తున్న ఆర్డీవో గ్లోరియా

కర్లపాలెం: గిరిజనులకు ఆహార పొట్లాలు అందజేయడం అభినందనీయమని కర్లపాలెం ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఐనంపూడి శ్రీనివాసరావు తెలిపారు. బాపట్లకు చెందిన ఫ్రెండ్స్ ఆదర్శయూత్ ఆర్గనైజేషన్ సభ్యులు గురువారం కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంక కాలువ కట్టపై నివాసం ఉంటున్న గిరిజనులకు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సునీత చేతుల మీదుగా ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గిరిజనులు బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వారి అవస్థలను గుర్తించిన బాపట్ల ఫ్రెండ్స్ ఆదర్శయూత్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆహారం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనేజేషన్ గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు బంద్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల సురేష్, సభ్యులు సువర్ణరాజు, శ్రీనివాసరావు, మద్దిబోయిన గోపి, నందిపాటి శ్రీరామ్‌సునీల్, శ్రీనివాసరావు, తన్నీరు గోపి, అంకమరావు, కృష్ణారెడ్డి, రవి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: విపత్తులు వచ్చిన సమయంలో కష్టాల్లో ఉన్న నిరుపేదలను ప్రతి ఒక్కరూ ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆర్డీవో గ్లోరియా పిలుపునిచ్చారు. ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణంలోని మూడో వార్డు రాజీవ్ గాంధీ కాలనీలో గిరిజన కుటుంబాలకు ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి చేతుల మీదగా ఆహార పొట్లాలను అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు, అధ్యక్షులు బంద్రెడ్డి గోపి, కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, సభ్యులు మద్దిబోయిన గోపి, భీమా కోటేశ్వరరావు, విన్నకోట శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు, యాలవల శ్రీనివాసరావు, తన్నీరు గోపి, షేక్ సుభాని, సీహెచ్ వెంకటేశ్వరరావు, బంద్రెడ్డి అంకమ్మరావు, శ్రీనివాసరావు, కె.రవి, తదితరులు పాల్గొన్నారు.

డొంక రోడ్లకు సర్వే నిర్వహించాలని వినతి


తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేస్తున్న వినతిపత్రం

భట్టిప్రోలు: కృష్ణా నది పరివాహక లంక గ్రామాల్లో ఆక్రమణలకు గురైన డొంక రోడ్లకు తక్షణమే సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని పెదపులివర్రు గ్రామానికి చెందిన రైతు కొమ్మినేని శ్రీమన్నారాయణ గురువారం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావును విజ్ఞప్తి చేశారు. లంక గ్రామాల్లో పంటల భూములకు అనుసంధానంగా ఉన్న డొంక రోడ్లను ఒకప్పటి ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు సర్వే నిర్వహించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారని అన్నారు. గత కొంత కాలంగా డొంక రోడ్లు ఆక్రమణకు గురి కావడంతో పంట భూములకు వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ అధ్యక్షులు వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలను కాపాడుకోవాలి

తెనాలి టౌన్: అధిక వర్షాలకు నీట మునిగిన వరి పైరును కాపాడుకోవడానికి సత్వరం పొలంలోని నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి రైతులకు సూచించారు. గురువారం రూరల్ మండలం హాఫ్‌పేట, ఖాజీపేట, కొలకలూరు గ్రామాల్లో ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పర్యటించారు. పైరు 5 రోజుల కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌వీవీఎస్ గోపాలస్వామి, డాక్టర్ ఎం.వెంకటరాములు, వీఏఏ నాగరాజు పాల్గొన్నారు.

రహదారిపై ఆవులు.. ప్రయాణానికి ఇబ్బందులు!



రేపల్లె పట్టణంలో ఆవులు రహదారిపైనే తిష్ట వేస్తున్నాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెదకూరగాయల మార్కెట్, ప్రభుత్వ వైద్యశాల, బస్టాండ్ సెంటరు, పండ్ల మార్కెట్, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పద్మావతి థియేటర్ సెంటర్‌లలో ఆవులు మందలుగా రహదారులపై సంచరిస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నాయి. ఆవులు రోడ్లపై పడుకుని ఉండడంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు సందార్భాల్లో ఆవులు కూడా గాయపడుతున్నాయి. సమస్య పరిష్కారానికి పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని.. అధికారులు స్పందించి రహదారులపైకి సంచరించే ఆవులను గోసంరక్షణశాలకు తరలించాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు. - రేపల్లె

నాటకంగా శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి చరిత్ర



తెనాలి: ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్రపై రూపొందించిన భక్తిరస పద్యనాటకం ప్రేక్షకుల అభినందనలను అందుకుంది. పట్టణానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు, స్వర్గీయ దీపాల సుబ్రహ్మణ్యం స్థాపించిన నాటక సమాజం.. శ్రీవిజయలక్ష్మి శ్రీనివాస నాట్యమండలి భక్తిరస నాటక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించింది. ఈ నాటక సమాజం గురువారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి చరిత్ర' నాటకాన్ని ప్రదర్శించారు. సురభి కళాకారులు రూపొందించిన భారీ సెట్టింగులు, కళ్లు చెదిరే రంగాలంకరణ కనువిందు చేశాయి. మొత్తం 25 మంది కళాకారులు పాత్రోచితంగా నటించారు. కన్యకాపరమేశ్వరిగా తెనాలి జ్యోతి నటించారు. ఇతర పాత్రల్లో గోపి, ఎస్.కొండలరావు, ప్రసాద్, దీపాల సత్యనారాయణ, సుబ్బారావు, తులసి, స్వామి, సాంబయ్య నటించారు. నటీనటులు పాత్రోచితంగా నటించారు. హార్మోనియం సహకారం శ్రీను, సెట్టింగ్స్ సురభి సంతోష్ తొలుత పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, గ్రీన్ ఫౌండేషన్ అధినేత గుంటి వెంకట్‌లు జ్యోతి ప్రజ్వలన చేశారు. దివంగత దీపాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చందు సుబ్బారావు, గోపీచందు, పలువురు కళాకారులు పాల్గొన్నారు. నిర్వహణగా దీపాల తారక సాయినాథ్ వ్యవహరించారు.

4వ రోజుకు చేరిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి నిరాహార దీక్ష

తెనాలి రూరల్: తెనాలి టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ తెనాలి టెలికాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె.పద్మావతి చేపట్టిన నిరసన దీక్ష గురువారం నాలుగో రోజుకు చేరింది. గుంటూరు జీఎం, ఎస్‌డీఈ ఫోనులో పద్మావతిని పరామర్శించి దీక్షను విరమించాలని కోరారు. ప్రవేటు ఏజెన్సీ వాళ్లను టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ ఖాళీ చేసి బయట సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని.. సంబంధిత హామీ ఇస్తే తాను దీక్ష విరమిస్తానని పద్మావతి స్పష్టం చేశారు.